క్లుప్తంగా

ఎమ్మెల్యే పూజలు

వినుకొండ (నూజెండ్ల): నియోజకవర్గంలోని నూజెండ్ల గ్రామంలో రామయోగయ్య స్వామి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం రాత్రి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన ప్రభలపై ఎమ్మెల్యే బొల్లా ప్రసంగించారు.

డైరీ ఆవిష్కరణ

నరసరావుపేట రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా డైరీని మంగళవారం జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆఫీసర్ వై.సి.సుబ్బరాయుడు ఆవిష్కరించారు. జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.ముత్తయ్య, ఉపాధ్యక్షుడు కె.హరనాథ్, కార్యదర్శి ఎం.వెంకటేశ్వర రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కళామందిర్‌సెంటర్, గడియార స్తంభం సెంటర్, కూరగాయల మార్కెట్ రోడ్డు, గాంధీపార్కు రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎల్‌పీజీ సిలెండర్లు స్వాధీనం

చిలకలూరిపేటటౌన్: గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ అధికారులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని రెస్టారెంట్లు, టీ దుకాణాలు, బేకరీలలో పౌరసరఫరాల శాఖ అధికారులు బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 25 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఏఎస్‌వో బాషు, చిలకలూరిపేట, గురజాల, సత్తెనపల్లి, మాచర్ల, పెదకూరపాడుకు చెందిన సీఎస్‌డీటీలు టి కొండారెడ్డి, శర్మ, అరుణాదేవి, మురళీధరరావు, గపూర్ పాల్గొన్నారు.

భర్త, అత్తమామలు అరెస్టు

చిలకలూరిపేటటౌన్: వివాహిత మరణానికి కారణమైన భర్త, అత్తమామలను అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల ఐదోతేదీ పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో నివాసం ఉండే వివాహిత ఆలగుంట జ్యోతి (20) కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల పేస్టు తిని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ ఆమె ఈ నెల 7వ తేదీ నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. చికిత్స పొందుతూ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త హరిబాబు, అత్తమామలు అంకమ్మ, సాంబయ్యలను పోలీసులు అరెస్టు చేశారు.

భర్తకు నాలుగేళ్ల జైలు!

నరసరావుపేట టౌన్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు నాలుగేళ్ల జైలు, రూ.1000 రూపాయల జరిమానా విధిస్తూ అదనపు సబ్ కోర్టు న్యాయమూర్తి మధుస్వామి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. వినుకొండ పట్టణానికి చెందిన షేక్ మస్తాన్‌వలికు హనీఫాతో 2015లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అదనపు కట్నం కోసం మస్తాన్‌వలి వేధింపులకు గురిచేస్తుండటంతో 2019 జులై 23వ తేదీన హనీఫా వంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని మృతి చెందింది. ఈ మేరకు వినుకొండ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిపై అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): చెరువులో దిగి ప్రమాదశాత్తు వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండ మండలంలోని కొప్పుకొండ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బైలడుగు అంజయ్య (50) సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మేతకోసం పశువులను కొప్పుకొండ చెరువు సమీపానికి తోలుకెళ్లాడు. పశువులు చెరువులోకి దిగడంతో వాటిని తోలేందుకు అంజయ్య చెరువులోకి దిగి మునిగిపోయాడు. దీంతో గ్రామస్తులు సోమవారం సాయంత్రం నుండి చెరువులో గాలింపు చర్యలు చేపట్టడంతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అంజయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. పట్టణ సీఐ అశోక్‌బాబు మృతదేహాన్ని పరిశీలించి వినుకొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ వేలంపాట

బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో వేంచేసి ఉన్న మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా కొబ్బరికాయలు విక్రయాలు, కొబ్బరి చిప్పలు బహిరంగ వేలంపాట పట్టణంలోని శ్రీప్రసన్నరామలింగేశ్వర, కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో రేపు (గురువారం) ఉదయం 10.30 గంటలకు ఉంటుందని దేవాదాయ అధికారి బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు పొందుపరచాలని, హిందూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిబంధనలకు లోబడి నిర్వహిస్తారని తెలిపారు. రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని, దేవస్థానంతో లావాదేవీలు, బకాయిలు ఉన్నవారు వేలంపాటకు అనర్హులని ఈవో చెప్పారు.

మార్చి ఒకటికి టిడ్కో గృహాలు అందజేత

- రూ.10 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వివిధ శాఖల అధికారులు



టిడ్కో గృహాల వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: చిలకలూరిపేట రోడ్డులో కేసానుపల్లి పంచాయతీ పరిధిలో నిర్మించిన 1504 టిడ్కో గృహాల వద్ద రూ.10 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు పూర్తిచేసి మార్చి ఒకటవ తేదీ నాటికి లబ్ధిదార్లకు అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలిసి టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. ఎప్పటిలోపు పనులు పూర్తివుతాయో విద్యుత్, టిడ్కో, పురపాలక అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మించిన గృహాల్లోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు చాలా మంది బ్యాంకు రుణాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారిలో 60 ఏళ్లు పై బడిన వారికి బ్యాంకులు రుణాలు ఇవ్వట్లేదన్నారు. అందువలన లబ్ధిదారులు తాము బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారో లేదోననే విషయం మున్సిపల్ అధికారులను వెంటనే కలిసి తెలియచేయాలన్నారు. రుణాలు దొరకని వారు రెండు ఇనస్టాల్‌మెంట్‌లో తాము చెల్లించాల్సింది చెల్లిస్తే వారికి ఇళ్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విద్యుత్ మీటరు కోసం రూ.450లు చెల్లించి వెంటనే మీటరు కేటాయిస్తారన్నారు. బ్యాంకు రుణం విషయంలో ఎవరూ అశ్రద్ధ చేయెద్దన్నారు. గతంలో కేవలం బిల్డింగ్ నిర్మాణం చేసి వెళ్లారని, ఇప్పుడు తాము రూ.10 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గృహాలకు సమీపంలోని డంపింగ్‌యార్డును మార్చే ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టిడ్కో విభాగ సూపరింటెండెంట్ ఇంజనీర్ చినకోటేశ్వరరావు, ఇ.ఇ ప్రసాదరావు, డీఇ టి.మధు, ఏఈ ఎస్.సుమలత, మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, డీఈ ఓ.శ్రీనివాసరావు, ఏఇ స్వర్ణరాజు, హౌసింగ్ డీఇ సత్యనారాయణ, విద్యుత్ విభాగ డీఇఇ వై.ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల ఎజ్రా, వేముల శివ, వంపుగుడిజాన్, హోలీవుడ్ రఘు, మూరే రవీంద్ర, కనకా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

షాదీఖానా ఇక పూర్తి ఎయిర్‌కండిషన్డ్

పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో గల షాదీఖానాను పూర్తిగా ఎయిర్ కండిషన్డ్‌గా(ఏసీ) చేయటంతో పాటు చేపట్టిన మరమ్మతు పనులు పూర్తిచేసి ఫిబ్రవరి రెండో వారంలో మైనార్టీ సోదరులకు అప్పచెబుతామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులతో కలిసి షాదీఖానాలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు నాన్ ఏసీగా ఉన్న షాదీఖానాను ఏసీగా మార్పు చేస్తున్నామన్నారు. చేపట్టిన పనులను జనవరి లోగా పూర్తి చేస్తామన్నారు. ఫిబ్రవరిలో నూతన షాదీఖానాను ప్రారంభించుకోవటం జరుగుతుందన్నారు. మైనార్టీలకు ఇటీవలనే ఆరామక్షేత్రం అందుబాటులోకి తెచ్చామని, జామియా మసీదు నిర్మాణం కూడా త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర, డీఇ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మహబూబ్‌భాషా, షేక్ కరిముల్లా, కందుల ఎజ్రా, హోలీవుడ్ రఘు, వేముల శివ పాల్గొన్నారు.

ములకలూరులో ప్రార్థనమందిరం ప్రారంభోత్సవం

నరసరావుపేట రూరల్: మండలంలోని ములకలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన బేతస్థ నిస్సీ మినస్ట్రీస్ ప్రార్థన మందిరం ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట దాదాపు రూ.1.5 కోట్లతో ప్రార్థనా మందిరాన్ని సంస్థ నిర్వాహకులు నిస్సీని అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీటీసీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ జెగ్రిపోతు యేసుదయ మేరి రత్నకుమారి, ఎంపీటీసీ సయ్యద్ మస్తాన్‌వలి, సంఘపెద్దలు గేరా నాగరాజు, సువార్తరావు, యేసురాజు, ఏలీసియా, మబ్బు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వంటశాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటప్పయ్య, ఫుడ్ సేఫ్టీ, ఇతర అధికారులు

చిలకలూరిపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం మాత్రమే అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య చెప్పారు. పట్టణంలోని శారదా జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుందర రామిరెడ్డితో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఆ మేరకు భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. దీంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అఫీసర్ సుందర రామిరెడ్డి వంటలో వినియోగిస్తున్న నూనెలు, ఇతర పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో వి.వెంకటేశ్వరరావు, ఎంఈవో కె.లక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ



కొత్త పింఛన్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లను అందజేస్తున్నదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు, పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి చెప్పారు. పట్టణంలోని పదో వార్డు పరిధిలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నూతనంగా పింఛన్లు మంజూరైన 15 మందికి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ తన పరిపాలన కాలంలో సామాజిక పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఆదుకున్నారని చెప్పారు. ఆయన చూపిన మార్గంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్షమైన పాలన అందిస్తున్నారని, తిరిగి ఆయనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సయ్యద్ బషీర్ మేస్త్రి, షేక్ గని, వైఎస్సార్ సీపీ వార్డు ప్రెసిడెంట్ షేక్ జాని, జాన్‌సైదా, మస్తాన్‌వలి, సయ్యద్ మునీర్, సచివాలయ కన్వీనర్లు షేక్ ఫరీద్‌వలి, షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

కేసానుపల్లిలో సంక్రాంతి సందడి



పొంగలి వండుతున్న మహిళలు

స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. యువతీ, యువకులు సాంప్రదాయ దుస్తులతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. యువతులు రంగవల్లులను తీర్చిదిద్దారు. భోగిమంటలు వేసి పాయసం, పిండివంటలు తయారుచేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. పందెకోళ్లు, కబడ్డీ పోటీలతో యువకులు సందడి చేశారు. గాలిపటాల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల కార్యదర్శి ఎంఆర్ శేషగిరిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

– నరసరావుపేట రూరల్

కూలీల సంఖ్య పెంచాలి

ప్రతిరోజూ 5 వేల పనిదినాలు లక్ష్యంగా పనులు చేపట్టాలి

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి సమీక్ష మంగళవారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలానికి ప్రతిరోజూ 5 వేల పనిదినాలు లక్ష్యంగా కూలీలచే పనులు చేయించాలని సూచించారు. కూలీల సంఖ్య పెరిగేవిధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలని, నూతన పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ క్లస్టర్ ఏపీడీ ఈ.బూసిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి, ఏపీవో జి.ఎస్.ఆంజనేయరాజు, క్షేత్ర,సాంకేతిక సహాయకులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్. కృష్ణానాయక్, బి.కాంతానాయక్ పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: రానున్న సీజనుకు ఉపాధి పథకంలో కూలీల సంఖ్య గణనీయంగా పెంపుదలకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఉపాధి పథకం పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు.

రోడ్ల మరమ్మతుకు అంచనాలు సిద్ధం

శావల్యాపురం: నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రోడ్లు మరమ్మతుల నిమిత్తం అంచనాలు సిద్ధం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కంచేటి నవ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో భాగంగా గుంతలు అధికంగా ఉన్న ఏరియాల్లో మరమ్మతులు చేయటానికి రంగం సిద్ధం చేశామన్నారు. తొలిదశలో భాగంగా నూజెండ్ల గ్రామం నుంచి ముప్పారాజు వారిపాలెం వరకు 11 కిలోమీటర్ల మేర రూ. 60 లక్షల వ్యయంతో రోడ్డు పనులు చేస్తున్నామన్నారు. రెండవ దశలో శావల్యాపురం నుంచి కారుమంచి వరకు 9 లక్షల 90 వేలు, వినుకొండ నుంచి వనికుంట వరకు రూ. 8 లక్షల 80 వేలు, బొల్లాపల్లి మండలం గుట్లపల్లి, రావులపురం, రేమిడిచర్ల వరకు రూ.20 లక్షలు నిధులు అంచనాలు సిద్ధం చేశామని టెండరు దశ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. వినుకొండ వయా కారంపూడి మాచర్ల రహదారి మార్గం పరిధిలో జాతీయ రహదారి మార్గం చేసేందుకుగాను ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు. మండల కేంద్రం శావల్యాపురం నుంచి కారుమంచి వెళ్ళు రహదారి మార్గంలో ఇరువైపులా 48 అడుగుల మేర ఆక్రమణ పనులు చేశామన్నారు. శావల్యాపురంలో ఆక్రమణలు మరలా పునరావృతం కాకుండా రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించేందుకే స్కిల్ హబ్

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఆశయంతో రాష్ట్రంలోని నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌ను ఏర్పాటు చేయనుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. పట్టణంలోని ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లో శిక్షణ పొందిన వారికి ఎమ్మెల్యే బొల్లా సర్టిఫికెట్లను అందజేసి ఉద్యోగం సాధించిన యువతకు నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ రకాల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో శిక్షణ అందిస్తుందని తెలిపారు. మన వినుకొండలో స్కిల్ హబ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ స్కిల్ హబ్‌లో వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి మార్గాలను చూపించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్కిల్ హబ్ ప్రతినిధులు, డిగ్రీ కళాశాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ఇంటివద్దకే పాలన

- వార్డులో రూ.6.14 కోట్ల సంక్షేమం, రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు
- ఏడవ వార్డు గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వం వచ్చిందనే భావనలో ప్రజలు ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం రాత్రి ఏడవ వార్డులో పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు వార్డు ఇన్‌చార్జి గేరా ధర్మారావు, నాయకులు ముద్దా కరిముల్లా, గేరా రాజు, ఆకాష్, సన్నీ, మాజీ కౌన్సిలర్ షేక్ జిలాని, డీలర్ జిలానీ ఘన స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఇప్పటివరకు ప్రతి గృహానికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వారు చెబుతున్న సమస్యలను వింటూ వారి మనోభావాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా నవరత్నాల పథకాలు అందుతున్నాయంటే అది వలంటీర్ల వ్యవస్థ ద్వారానే సాధ్యమైందని ప్రజలు భావిస్తున్నారన్నారు.

ఈ వార్డులో ఎక్కువగా మైనార్టీలు, ఎస్సీ సోదరులు నివాసం ఉంటున్నారన్నారు. అందరూ సీఎం జగన్ పరిపాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, ఇళ్లపట్టాలు, అమ్మఒడి ద్వారా పిల్లలను చదివించుకునే అవకాశంతో ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారన్నారు. గతంలో ఈ వార్డులో ఉన్న సుబ్బారెడ్డి ప్లాట్లు, మరికొంత పంచాయతీ పరిధిలో ఉండేదన్నారు.వాటిని పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి సీసీ రోడ్లు, డ్రైయిన్లు, తాగునీటి పైపులైన్లు కోసం రూ.1.60 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నూతనంగా రూ.6 లక్షల వ్యయంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి అభివృద్ధి చేశామన్నారు. వార్డు ప్రజలకు రూ.6.14కోట్ల సంక్షేమపథకాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఇ ఓ.శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణరాజు, విద్యుత్‌శాఖ ఏఇ సురేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి రమేష్, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి బాబ్జీ, మాడిశెట్టి మోహనరావు, బత్తుల లక్ష్మీపద్మలత, నాయకులు చల్లా రామిరెడ్డి, సయ్యద్‌ఖాదర్‌బాష, గుంటి ప్రశాంత్, మైలేరి మార్కు, షేక్ మహబూబ్‌భాష, సయ్యద్ ఫాతిమా, సన్నీ, సైదా, పింటు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటం కోసం ప్రజలను బలితీసుకున్న వ్యక్తి చంద్రబాబు

రాష్ట్రంలో కేవలం తన ప్రచార ఆర్భాటం కోసం 40 మందిని బలితీసుకున్న వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే అది ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ఏడవ వార్డులో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రానికి 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి 40ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీగా చెప్పుకుంటూ ముఖ్యమంత్రిగా 29 మందిని, ప్రతిపక్ష నాయకుడిగా 11 మందిని పొట్టన పెట్టుకున్నాడన్నారు. తన కంటే చిన్న వయస్సున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ప్రాణాలు పోకూడదనే ఉద్దేశ్యంతో జీవో ఒకటిని అమల్లోకి తీసుకొస్తే బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నాడన్నారు.

పార్డ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

వినుకొండ (నూజెండ్ల): పార్డ్ (పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో నూజెండ్ల మండలంలోని కొత్త జడ్డవారిపాలెం గ్రామంలోని పార్డ్ గ్రామీణ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి గ్రామీణ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ పారా వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. విజేతలైన వారికి మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. రూ.999 రుసుము చెల్లించిన 30 టీమ్స్‌కు మాత్రమే అవకాశం ఉందని, ఆసక్తి గల జట్లు 8639714270, 7661835461 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి



బహుమతి పొందిన చిత్రం

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి చిత్రకళాపోటీలలో పట్టణానికి చెందిన షేక్ బాషాకు ప్రథమ బహుమతి బంగారు పతకం, భారత చిత్రకళారత్న అవార్డు లభించింది. క్రియేటివ్ ఫైనాక్స్ అకాడమీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన పోటీలలో ఈ బహుమతి లభించినట్లు చిత్రకారుడు బాషా మంగళవారం తెలిపారు. బాషాకు అవార్డు రావటం పట్ల పట్టణ కళాకారులు అభినందనలు తెలిపారు.

14న జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో గ్రామపెద్దల సహకారంతో ఈనెల 14వ తేదీన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పల్నాడు జిల్లాస్థాయిలో షటిల్ టోర్నమెంటు పోటీలు నిర్వహించుతున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ ప్రథమ బహుమతి రూ.15 వేల 116లు, రెండవ బహుమతి శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య రూ.12.116లు, మూడోవ బహుమతి బోయపాటి గాంధీ, గట్టుపల్లి వీరాస్వామి రూ.10.116లు నగదు బహుమతులు విజేతలకు అందజేస్తామన్నారు. ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించాలన్నారు. జూనియర్ విభాగంలో 16 సంవత్సరాలు వారు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత అన్నారు. పోటీలు ప్రకటించిన విధంగా సాయంత్రం 5 గంటలకు ప్రారంభం అవుతాయన్నారు. తుది నిర్ణయం కమిటీ వారిదేన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 9100212503, 6305807644, 8008710499 సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించాన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సభ

రొంపిచర్ల: ప్రజల వద్దకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగం గురువారం స్థానిక మార్కెట్ యార్డులో విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ బి. వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జె. పద్మాజనార్థన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసన సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వ్యాపార సంస్థల నిర్వాహకులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై గల్లా రవికృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జాతీయ రహదారి మార్గంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై రవికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు ఆటో డ్రైవర్లు, వాహనదారులు అధికలోడుతో ప్రయాణం చేయటం చట్టారీత్యా నేరమన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో పుడమిపుత్ర రైతు పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బోనస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. డెయిరీ మేనేజర్ జి.బాలకృష్ణ మాట్లాడుతూ, పాల ఉత్పత్తిదారులకు కంపెనీ తరపున ఉచితంగా భీమా, సబ్సిడీపై పశువులకు దాణా అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు లాభదాయకమైన యాజమాన్య పద్ధతులతో మంచి పాల దిగుబడిని సాధించవచ్చన్నారు. దీంతో ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. అనంతరం రూ.9,24,927 విలువైన బోనస్‌ను పాడి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలసేకరణ ప్రతినిధులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

లింగారావుపాలెంలో సంక్రాంతి సంబరాలు

యడ్లపాడు: డీవైఎఫ్‌ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) 43వ సంక్రాంతి సాంస్కృతిక క్రీడా సంబరాలు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 13, 14, 15వ తేదీల్లో లింగారావుపాలెం గ్రామంలో పలు క్రీడా పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే వారు 12వ తేదీన టీమ్స్ నమోదు చేసుకోవాలని సూచించారు.

పోటీల వివరాలు..

13న సైకిల్‌స్లో, క్రికెట్ టోర్నమెంట్, బాల్‌బాడ్మింటన్, షటిల్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీలు ఉంటాయన్నారు. 14న రన్నింగ్, వాలీబాల్, క్రికెట్, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు ఉంటాయన్నారు. కుండకొట్టుట, మ్యాజిక్‌షో విభాగాల్లో పోటీలు ఉంటాయి. 15వ తేదీ ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, ఫన్నీగేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామస్తులు ఆధ్వర్యంలో బావాబావా పన్నీరు సాంఘీక హాస్యనాటిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా కార్యక్రమాలను లింగారావుపాలెం అభివృద్ధి కమిటీ, విజన్‌ఫౌండేషన్ సంయుక్త సహకారం అందిస్తున్నట్లు చెప్పారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నాదెండ్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదం నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నాదెండ్ల ఎస్సై ఆవుల భాస్కర్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో ఎక్కడ కోడిపందెల నిర్వహణకు అనుమతులు లేవని, కోడిపందేలు, అసాంఘిక కార్య కలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గతంలో కోడిపందేలు నిర్వహించి కేసులు నమోదైన ఏడుగురిని మంగళవారం బైండోవర్ చేశామన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలీసు ఆదేశాలు ధిక్కరిస్తే రౌడీషీట్‌లు తెరుస్తామని హెచ్చరించారు.